# శివుని ఖడ్గం

(ఉర్దు మూలం: కే.ఎ. అబ్బాస్)

రా నాయనా, వాన ఎడాపెడా కురుస్తోంది. నువ్వు బయట నిలబడవద్దు - జలుబు పట్టేస్తుంది. లోపలికి రా. ఈ పేద ముసలమ్మ కొంపలో వాన ఆగేవరకు కొంచం ఉండు . . .

చూసావా, భగవంతుని లీలలు ఎన్ని రకాలో? చూడు, ఇప్పుడు వాన ఎలా కురుస్తుందో . . పట పట మని చినుకులు ఆకాశం నుంచి పడుతున్నాయి. ఈ వానే ఆర్చుకుపోయిన ఈ భూమికి ప్రాణం పోస్తోంది. ఈ వానే విత్తనాన్ని నారుగా మార్చి ఆ నారుని మొక్కగా చేస్తుంది. మనందరికీ జీవితం ఇచ్చేది ఈ వాన - ఇది లేకుండా మనం బ్రతకగలమా? ఐతే గంగమ్మ తల్లికి కోపం వస్తే ఇదే వాన - వరదలు వచ్చినప్పుడు, మన పంటలూ పొలాలూ నీరులో మునిగి కుళ్ళిపోతే- గ్రామాల్ని మింగేసి చాలామంది చావుకి కారణమవుతుంది. వాన వలన జీవితమూ, చావూ రెండూ ఏర్పడతాయి - అదంతా మన కర్మ బట్టి ఉంటుంది. మనం చేసే పాపాలకి మనం ఒడిపెట్ట వలసిందే . .జొన్నమొక్క నాటితే ధాన్యం దొరుకుతుందా చెప్పు . . పరమేశ్వరుని కళ్ళు అడుగడుగునా ఎవరెవరు ఏం చెస్తున్నారని కాపుకాచుకొని ఉంటాయి. ఎవరు అధర్మం, పాపం చేస్తారో వాళ్ళని ఈశ్వరుని కన్నులోనుంచి కోపాగ్ని బాణంలాగ వచ్చి రూపుమాపు లేకుండా



చేస్తుంది. అలాగే కదా ఆ గొప్ప రావణుడు చివరకి అణగిమణగి పోయాడు; అతని పసిడి లంకా రాజ్యం కేవలం కోతుల దండువల్ల ధ్వంసమైంది; మహా రాజు కంసుడు కూడా ఒక ఆవు కొమ్ములతో మోదుకొని ప్రాణం వదిలాడు . . . . .

భగవంతుని ఆయుధాలు ఒకటా రెండా? అందులో పెద్దది కిక్కురమనకుండా దుర్మార్గుల తలను బదలుకొడుతుందట. ఐతే చూడడానికి చాలా అసహ్యమైన ఆయుధం ఏదో తెలుసా? దాన్నే శివుడు దేవేంద్రునికి అప్పగించాడట. దుష్టుల మీద దాడి చేసి వాళ్ళని నిర్మూలం చెయ్యడం దేవేంద్రుని పని కదా? అందువలన అతనికి ఒక ఘోరమైన ఆయుధం కావాలి . .

అదిగో, నాయనా, అటు చూడు - ఈ కిటికీలోనుంచి ఆ ఆకాశాన్ని చూడు . . ఆ నల్ల మబ్బుల మధ్య ఆ మెరుపుతీగ చూడు . . దానికి పేరు శివుని ఖడ్గం . . అది శివుడు దేవేంద్రునికి ఇచ్చిన ఆయుధం; దానితో దేవేంద్రుడు పాపాత్ములని, కళుషితమైనవారిని నిర్మూలం చేస్తాడు. నీకు తెలుసుగా ఈ పిడుగు సబ్దం వినగానే ఎలాగ దుష్టులూ, పాపాత్ములూ బెదరిపోతారని? ఈ శివుని ఖడ్గం ఇనుముతోనో, ఉక్కుతోనో చేసినది కాదు; కాలక్రమంలో అవి తుప్పు పట్టి మొండికట్టిపోతాయి. కాని ఈ శివుని ఆయుధం అంటే ఏమనుకున్నావో? ఒకానొకప్పుడు ఒక యోగి చాలా సంవత్సరాలు ఒంటరిగా వానలో, ఎండలో తపస్సు చేసాడట; అతని కండలు

కరిగిపోయి ఆఖరికి అతని అస్థిపంజరంలో ఆర్చుకుపోయిన తెల్లని ఎముకలే మిగిలాయి. ఆ పవిత్రమైన ఎముకలనుండి - అవి గట్టిగా, తీక్షణమైన వజ్రాలు లాగ ఐపోయాయి - శివుడు ఒక ఆయుధం తయారు చేసాడు. దాన్నే నువ్వు ఇప్పుడు ఆ ఆకాశంలో చూస్తున్నావు.

నాయనా, నీకు తెలుసుకదా మెరుపుతీగ పాములని తాకుతుందని. కాని అది ఎందుకు అని నువ్వు ఎప్పుడైనా ఆలోచించావా? ఐతే, విను: ఈ విష జీవులు, నల్లనాగులు, పూర్వ జన్మలో దారుణం లేకుండా క్రూరంగా అమాయకులనీ కరిచి వాళ్ళని బాధ పెట్టాయి. అందువలనే దేవుడు వాళ్ళకి కొత్త జన్మలో ఇలాగ దండించాడు. ఐతే మెరుపుతీగ పాములనేకాక చెడ్డ మనుషులనీ కూడా తాకుతుంది. నాయనా, నా మాట విను; దేవుని కళ్ళు అందరి హృదయాల్లోనూ దూసుకొని పోయి తెరలు తెరలుగా అణగి ఉన్న స్వభావం అర్థం చేసుకుంటాయి; ఇక బయట కనిపించే తెల్లని వస్త్రాలూ, రాచవారి క్రీటాలూ, ధనం, ఆస్తులూ, ఇవన్నీ చూసి అవి మోసపోవు. మనుషుల హృదయంలో దాగి ఉన్న అధర్మం, అబద్ధాలూ ఒక క్షణంలో తెలిసిపోతాయి. ఆ శివుని ఖడ్గం తాకినప్పుడు అది ఎంత పెద్ద చెట్టయినా దాన్ని వెన్నలాగ చేడించుతుంది. నాకు తెలుసు, నాయనా, నేను అది నా సొంత కళ్ళతో చూసాను . . .



మీరు ఈ నాటి కుర్రవాళ్ళు, స్కూల్లో పెద్ద పెద్ద పుస్తకాలు చదువుతారు, ఈ ముసలమ్మ మాటలు నమ్మరు. నాకు పిచ్చి అని చెప్తారు. అది నిజమో ఏమో . . కాని నేను చెప్పేది నిజం, దేవుని మీద ఒట్టు. నేను అబద్ధం చెప్తే నా మీద పిడుగు పడనీ . .

ఇది ఎన్ని సంవత్సరాల ముందు అని నాకు జ్ఞాపకం లేదు - ఇరావయ్యో, ఇరవై ఐదో, లేకపోతే ముప్పైయ్యో, నాకు లెక్క తెలియదు. ఐతే ఈ గ్రామంలో చాలమందికి నేను చెప్పే ఈ వింత కథ నిజమని ఒక వెర్రిదాని వాగుడు కాదు అని బాగా తెలుసు. కావాలంటే మీరు వెళ్ళి ఈ గ్రామం చివరన ఉన్న గుడి, దాని వెనుక ఉన్న చెరువు దాటి, అక్కడ ఉండే తొలచిన వేపచెట్టు మొద్దుని చూడండి. అది ఎబ్బెట్టుగా, ఒక దిష్టిబొమ్మలాగ తన చేతిని ఆకాశంకి చూపుతున్నట్టు ఒక పొలం మధ్య కనిపిస్తుంది. ఒకప్పుడు అది ఎంత పెద్ద చెట్టు, దాని ఆకులు ఎంత వొత్తుగా ఉండేవి అంటే ఇరవై మంది దాని అడుగున నిలుచున్నా వాన పడితే ఒక చినుకకూడా ఎవరిమీదా పడదు. కాని నేను చెప్పబోయే ఆ సంఘటన తరువాత ఆ చెట్టులో ఒక ఆకు వసంత కాలంలోకూడా మొలవలేదు. ఆ నాడు శివుని ఖడ్గం నిప్పులు కక్కి చెట్టు అడుగున చాటుకోసం వచ్చిన నలుగురిని కోత కోయడంతో ఆ చెట్టూ, దాని వేరులూ పూర్తిగా కాలిపోయాయి.

ఆ రోజుకూడా ఇలాగే పెద్ద వాన కురిసింది. ఆ సంవత్సరమంతా ఒకటే వాన: రాత్రి, పగలూ, రోజులూ, వారాలూ, నెలలూ ఎడతగని వర్షం. చెరువంతా పొరలిపోయి మా గ్రామాన్ని పొరుగు ఊరుతో కలిపే ఆగ్రా రోడు పూర్తిగా నీళ్ళకింద ముంచుకుపోయింది. జనులు ఎక్కడికి వెళ్ళాలన్నా పొలాల్లోనే నడిచి వెళ్ళాలి; అవికూడా చిన్న చిన్న గుంటలుగా మారిపోయాయి. గ్రామానికి బయట ఉన్న హరిజనుల గుడిసెలు బాగా దెబ్బ తిన్నాయి; గోడలన్నీ కుప్పకూలిపోయాయి. ఒక బిడ్డ - పుట్టి ఇరవై రోజులే ఐంది - చనిపోయింది . .

నాయనా, నన్ను క్షమించు; నేను ముసలమ్మని, నా కళ్ళు అప్పుడప్పుడు చెమ్మగిల్లిపోతాయి.నేను ఏడుస్తున్నాని అనుకోవద్దు. నా వంటి పిచ్చిదానికి ఏడవడానికి ఏముంది చెప్పు?

నేను చెప్పానుగా, అది వానాకాలం. కాని ఆ రోజు వాన కొన్ని గంటలకి ఆగింది; ఆ సమయంలో జనులు ఇళ్ళనుంటి వెలుబడి తమ తమ చిల్లరపనులకోసం బయటకు వెళ్ళారు. కొందరు పొలాలకి వెళ్తే మరి కొంత మంది పక్క ఊరికి - ఆ ఆగ్రా రోడు దారి తీసే రాజ్ పూరుకి- వెళ్ళారు. అక్కడ ఆ నాడు సంత. ఐతే రోజంతా ఆకాశంలో నల్లటి మబ్బులు కనిపిస్తూనే ఉన్నాయి. మధ్యాన్నం వచ్చేసరికి మళ్ళీ వాన ఆరంభించింది. గ్రామానికి దగ్గరగా ఉన్నవాళ్ళు చాటుకోసం తమ తమ ఇళ్ళకి పరుగెత్తారు.



కాని నలుగురు మాత్రం - వేరే వేరే దిశాల్లో ప్రయాణం చేస్తూ - ఆఖరికి ఆ వేప చెట్టుని చేరుకున్నారు. వాళ్ళందరూ ఆ నాడు అలాగ ఒకే చోట కలుసుకోవడం వాళ్ళ తలరాత అని చెప్పాలి

నీకు ఆ నలుగురులో ఎవరూ పరిచయం లేదనుకుంటా - నువ్వు అప్పుడు పుట్టికూడా ఉండవు. కాని వాళ్ళలో ఒకతనుగురించి నువ్వు తప్పకుండా విని ఉంటావు. అతను ఇప్పుడు ఉంటున్న ఈ ఊరు జమిందారుగారి పెద్ద అన్నయ్య. అతని పేరు థాకూర్ హర్నాం సింగ్. మంచి ఆజానబాహువు, అతనికి విశాలమైన ఛాతీ, పెద్ద, నల్ల మీసాలు. అతనికి ఇంకా పెళ్ళి అవలేదు కాబట్టి ఊరులో ఉన్న భూస్వాముల అమ్మాయిలందరూ అతన్ని భర్తగా కావాలని ఆశ పడ్డారు. అతను గుఱ్ఱం మీద గ్రామంలో సవారి చేస్తుంటే యువతులు తమ తమ ఇళ్ళలో, రహస్యంగా, తలుపు వెనుక నిలబడి అతన్ని చూస్తారు; అతను వాళ్ళని చూసాడంతే వెంటనే సిగ్గు పడి పోతారు. అతనికి మంచి వాక్సుద్ధి కూడా ఉంది; అతను మాట్లాడితే అందరూ ఏదో మంత్ర విద్యలో చిక్కుకున్నట్టు పరవశమై వింటారు . .

ఏమైంది నా కళ్ళకి, ఈ రోజు? ఈ పొయ్యిలోనుంచి వచ్చే పొగ అనుకుంటా .

హర్నాం సింగ్ జమిందారుగారి అబ్బాయి, కాని ఎప్పుడూ రైతులతోకూడా చనువుగా మాట్లాడతాడు. ఇక డబ్బంటే బాగా

ఖర్చు పెడతాడు. ఊరిలో అందరికీ అతనంటే మర్యాద; 'ఇక జమిందారు అంటే ఇలాగే ఉండాలి,' అని అందరూ అనేవారు అతన్ని చూసి. అతనికి వేటాడడం అంటే చాలా ఇష్టం. ఆ రోజు వాన ఆగిన వెంటనే అతను బాతులని వేటాడానికి బయలుదేరాడు. కాని దారిలో మెరుపుతీగలు చూసి అతని గుఱ్ఱం బెదిరిపోవడంతో అతను కింద బురదలో పడి ఒక కాలు విరగొట్టుకున్నాడు. థాకూర్ పెండ్రుకవాసిలో తప్పుకున్నాడు కాని అతని గుఱ్ఱం ఈ అపాయంవలన బాధ పడుతూ మూలుగుతుంటే అది చూసి భరించలేక తన తుపాకీతో అక్కడే దాన్ని కాల్చి చంపేసాడు. అతను తన బంగళాకి తిరిగి నడచి వస్తుంటే వాన మళ్ళీ కురవడంతో ఆ వేపచెట్టుని చేరుకొని అక్కడ ఉన్న ముగ్గురిని - అందరూ అతనికి తెలిసిన వాళ్ళే - చూసాడు.

ఆ ముగ్గురిలో ఒకతను ఆ ఊరి పూజారి, బ్రాహ్మణుడు, పండిట్ ధరం దాస్. చాలా బక్కపలచిన దేహం, నుదుట మీద పెద్ద నామమూ, ఒంటిలో జందెం ఎప్పుడూ కనబడతాయి. మా ఊరిలో అతనే అందరికంటే బుద్ధిలో, చదువులో గొప్పవాడు అని చెప్తారు. మన శాస్త్రాలన్ని అతనికి రుక్కు. అతనికి ఒక ఆరాటం:ఊరులోని మనుషులు భక్తిమార్గంలోనుంచి దారి తప్పకూడదు అని. అతని వలనే మా ఊరికి సంస్కరించే ఉద్దేశంతో ఎవరు వచ్చినాకూడా - వాళ్ళు జాతి, అస్పృశ్యత గురించి ఎన్ని మార్లు ఉపదేశించినా



వినడానికి ఎవరూ ఉండరు. ధరందాస్ వాళ్ళని నాస్తికులు అని అంటాడు, ఊరినుంచి వెళ్ళగొట్టాడు. అతని భార్య పోయింది కాని అతనికి ఊరులో ఉన్న అబ్బాయిలూ, అమ్మాయిలూ, వాళ్ళ నీతినియమాలూ గురించి ఒకటే బాధ. అతనెప్పుడైనా ఒక యువకుడూ, యువతీ పక్క పక్క నిలబడి మాట్లాడడం చూసాడంటే వెంటనే కోపంతో పంచాయతిని పిలిచి వాళ్ళని ఘాటుగా దండించమంటాడు. అతను మళ్ళీ మళ్ళీ అనేవాడు:

"ఇలాగ కుర్రతనంలో ఈ ఆడ మగవారు రహస్యంగా కలుసుకోడం, ప్రేమ సల్లాపం చెయ్యడం మనం భరించకూడదు; ఈ గుసగుసలే పాపాలకి మొలకలు." ఆ తరువాత ఏ అబ్బాయికీ ఒంటరిగా ఏ అమ్మాయినీ కలుసుకోడానికి - ముఖ్యంగా పండిట్ దగ్గర ఉంటే - ధైర్యం రాదు.

ఐతే మరి ప్రేమలో పడితే అడ్డదిడ్డంగా ఏమేమో జరుగుతాయి కదా? ప్రేమ పండితులూ, పూజారిలూ చెప్పే మాటలు వింటుందా? పండిట్ హెచ్చరించిన ఆ పాపష్ఠ కూపంలో ఎవరో ఒక అమ్మాయి పడింది. దాని పేరు చందా - కంసాలి మూలారామ్ కూతురు. ఊరులో అందరికీ ఆమెను చూస్తే అసహ్యం - ఈ సిగ్గులేని పిల్ల పాపం చెయ్యడమేకాక దాని ఫలాన్నికూడ అనుభవించింది; పెళ్ళి అవకుండా ఒక శిసువుకి తల్లి అయింది; సిగ్గు లేకుండా ఆ బిడ్డను లాలిస్తూ రొమ్ములో అణచుకుంది. వాళ్ళ

అమ్మ ఆమెను తిట్టింది; తండ్రి దాక్షిణ్యం లేకుండా బాదాడు. పండిత్ ధర్మ్ దాస్ ఆమె దేహానికి ఇక నరకంలో ఏమవుతుందో వివరించి చెప్పాడు. పంచాయతీలోని పెద్ద మనుషులు ఆమెతో చనువుగా, ముద్దుగా మాట్లాడి ఆ పాపిష్టి బిడ్డకి ఎవరు తండ్రి అని చెప్పమన్నారు. కాని చందా చెప్పలేదు. " నేను అతనికి ద్రోహం చెయ్యలేను; నాకు తెలుసు, నేనే పాపం చేసాను. నాకు శిక్ష ఇవ్వండి, కావాలంటే చంపండి. నేను అతని పేరు ఇవ్వను." ధర్మ్ దాస్ మాట విని ఆమెని జాతిభ్రష్టం చేసి ఊరునుంచి వెళ్ళగొట్టారు. ఆ తరువాత ఆమె ఆ ఊరు బయట ఉండే హరిజనుల మధ్య ఒక గుడిశెలలో కాలం గడుపుతుందని ఊరిలో చెప్పుకున్నారు. అది విని ధర్మ్ దాస్ " సరే, అలాగే కానీ, దేవుని కళ్ళలో ఆమె ఆ హరిజనులలాగే పాపాత్మురాలు," అని అందరికీ చెప్పాడు.

ఆ వేపచెట్టు కింద నిలబడిన ఇంకొకతను పేరు మూల్చంద్.- అతను ఒక షావుకారు. మా గ్రామంలో చాలామంది అతనితో వడ్డీ వ్యాపారం చేసేవారు. ఎవరికి డబ్బు కావాలన్నా - పెళ్ళి, అంత్యక్రియ లేక నిశ్చయతార్థం వస్తే, అతను వాళ్ళకున్న భూమీ, నగలూ చూసి, వాటికి జామీనుగా రొక్కం ఇచ్చేవాడు. అతను అడిగే వడ్డి కొంచం ఎక్కువే; అతను ఆ మొదటి సంవత్సరం వడ్డీని ముందుగానే మినహాయించి అప్పు ఇస్తాడు. ఐతే అందుకోసం ఎవరూ



అతన్ని తప్పెట్టరు. "వడ్డీ వ్యాపారంలో ఇది మామూలేగా?" అని వాళ్ళ వాదం. అందరూ అతన్ని పొగడ్తూనే ఉంటారు: అతను అన్ని రకాల పూజలకూ, పండుగలకూ అరువు ఇచ్చేవాడు; అంతేకాదు; రాజ్ పూర్ లో మాత్రం కాక పొరుగున ఉన్న గ్రామస్తులకీ రొక్కం ఇచ్చేవాడు. అతనికి దేవుడంటే భయమూ, భక్తి ఉన్నాయి. మూలారాం కూతుర్ని గ్రామం నుంచి తరిమేసారని వినగానే అతను పండిట్ ధర్మ్ దాస్ని అభినందించాడు. " కాని పండిట్జీ, మీకు అందరి మీదా జాలిపడే అలవాటు. మా రాజ్ పూర్లో చందా లాంటి అమ్మాయి కనబడితే దాని కాళ్ళు విరగ్గొట్టి నూతిలో పారేస్తాం; మరేం అనుకున్నారో?" అను మూల్చంద్ అన్నాడు. అతనిలో ఇంకొక విశేషం ఏమంటే అతను ఎప్పుడూ మంచి తెల్ల బట్టలే తొడుగుతాడు; ఇప్పుడే చాకలివాడు ఆ బట్టలు తెచ్చాడా అనిపిస్తుంది. అతను వచ్చేటప్పుడు మంచి అత్తరు వాశన వేస్తుంది; అతను చెమటకోసం అది వాడుతాడు అని కొందరు అనేవారు. మూల్చంద్ అనేవాడు: "మన దేహం బాగా ఉంటే హృదయం కూడా బాగా ఉంటుంది. ఇక హృదయం ఆరోగ్యంగా ఉంటే, దేహమూ ఆరోగ్యంగా ఉంటుంది."

ఇక ఆ చెట్టుకింద నాలుగవ మనిషి రెహమత్ ఖాన్, మా గ్రామ కరణం.అతని పని లెక్కలు రాయడమూ, తనిఖీ చెయ్యడమూ. నాయనా, ఈ రోజుల్లో వీళ్ళ కీర్తి కుంగిపోయింది. కాని ఆ రోజుల్లో

మా గ్రామస్తులకి కరణం అంటే రాజు, వైస్రాయ్, గవర్నరూ, కలెక్టరూ వాళ్ళందరి లక్షణాలూ కలిసి ఉండే ఒక వ్యక్తి అన్న మాట. గ్రామంలోని అన్ని ఇళ్ళగురించి లెక్కలూ, పత్రాలూ, భూమి కొలతలూ, వాటిని ధాకలు చేసిన వివరాలూ, అమ్మకాలూ - ఇవన్నీ కరణం చేతిలో ఉంటాయి. రైతులకి చదవడం, రాయడం తెలియదు కాబట్టి కరణం ఎక్కడ చెప్పితే అక్కడ వాళ్ళు వేలు ముద్ర పెడతారు - అంటే - లావాదేవీ చేసేటప్పుడు పెట్టే ముద్రలాగ. రెహ్మత్ ఖాన్ రైతుల ఆస్తి విషయాలలో వాళ్ళకి బోధపడని అంశాలని సంతోషంగా తెలియపరచుతాడు. రైతులుకూడా అతనికి సంతోషంగా డబ్బు ఇస్తారు. ఇదేమో లంచగొండితనం లాగ ఉందే అని మీరు అడగవచ్చు. ఐతేనేం, రెహ్ మత్ ఖాన్ దైవ భక్తి, అతను రోజూ ఐదు సార్లు తన నలుపు తెలుపు గడ్డంతో మసీదులో ప్రార్ధన చెయ్యడం అందరికీ తెలుసు. అతను ఇంతకు ముందే మెక్కాకి తీర్థయాత్రకి వెళ్ళాడు, మళ్ళీ ఇంకొకసారి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నాడు. అందువలనే అతని దగ్గరకి వచ్చే ప్రజలు అతని యాత్రకోసం కొంచం ఎక్కువగా దక్షిణ ఇవ్వాలి! అతనికి ఇద్దరు భార్యలు; చిన్నదానికి ఇరవై ఉండవచ్చు; ఆమె అతని కూతురుకంటే -అతని మొదటి భార్యకి పుట్టినది - ఒక రెండు సంవత్సరాలు పెద్ద. రెహ్ మత్ ఖాన్ కి గోషా చాలా ముఖ్యం - అందులోనూ రెండవ భార్యగురించి చాలా పట్టుదల.



అతను ఒక పఠాను, అందువలన కోపిష్టి కూడా. ఒక సారి రెహ్మత్ ఖాన్ నేతకాడు నూర్ బక్షిని బాగా కొట్టడంతో వాడు మంచం ఎక్కిన తరువాత మూడు రోజులు లేవలేదు. అలాగే గోడారి చిడ్డాని వాడు కరణం కోరిన చెప్పులకి ఎక్కువగా డబ్బు అడిగాడని రెహ్ మత్ ఖాన్ వాడి నడుం విరగ్గొట్టాడు. ఐతే ఒక సంగతి చెప్పాలి: అతను ఇలాంటి మొరటు ప్రవర్తన చూపేది కులం తక్కువ వారితోనే. జమిందారు, వాళ్ళ కుటుంబం, పండిత్ ధర్మ్ దాస్, షావుకారు దగ్గర అతను మర్యాదతో మెలుగుతాడు. ఇక జిల్లా పరిషత్ నుంచి ఎవరైనా అధికారి తనిఖీకోసం గ్రామానికి వస్తే రెహ్ మత్ ఖాన్ వాళ్ళని అన్ని విధాలా తృప్తి పరచడానికి ప్రయత్నం చేస్తాడు. ఊరిలో అందరూ కరణంగారి ఆతిథ్యమే కాకుండా అతనికి పెద్ద మనుషుల మధ్య ఎంత ఖ్యాతి ఉందని చెప్పుకుంటారు.

అలాగ, ఆ రోజు, ఈ నలుగురూ ఆ వేపచెట్టుకింద నిలబడి వాన ఆగాలని ప్రార్ధన చేస్తున్నారు. అప్పుడప్పుడు మెరుపుతీగలు మెరుస్తున్నాయి; ఉరుముల సబ్దాలు, రాక్షస దండోరాలు మ్రోగుతున్నట్లు వినబడ్డాయి. బాగా చీకటి కప్పేసింది; ఒక మెరుపుతీక ప్రకాశంలో, పశ్చిమ దిక్కులో చూస్తే వాళ్ళకి ఏమిటి కనిపించిందో తెలుసా? రుల్డూ అనే ఒక గోడారి ఆ చందా అనే దిక్కుమాలిన యువతీ ఆ వేపచెట్టుకి తిన్నగా వస్తున్నారు. ఇద్దరి

దేహాలూ బాగా తడిసిపోయాయి; వాన ఇంకా తీవ్రంగా కురవడంవలన వాళ్ళు చాటుకోసం ఇదే వేపచెట్టుకి వస్తున్నారు అని బోధపడింది.

ఐతే, నాయనా, నేను నీకు ఈ రుల్డా గురించి చెప్పడం మరిచిపోయాను. అతను ఒక గోడారి, మంచివాడు; అతని ముడుచుకున్న మొహం చూస్తే అతను చేసిన ఒక పాత చెప్పులాగ కనిపిస్తుంది. అతను హరిజనుడైనా ఊరిలో అందరూ అతన్ని ప్రేమతో ' రూల్డా కాకా ' అని పిలుస్తారు. ఊరిలో ఉన్న చాలా మంది వాళ్ళ బాల్యంలో నుంచి అతను చేసిన చెప్పులే వాడారు. ఆ దిక్కులేని చందాన్ని ఊరులోని పెద్ద మనుషులు గ్రామం నుంచి వెళ్ళగొట్టినప్పుడు ఈ రూల్డాపే ఆమెకు నిలవనీడ ఇచ్చి కాపాడాడు. ఆమె ఏడుస్తూ, తండ్రి లేని తన బిడ్డను చేతుల్లో మోసుకొని ఆ హరిజనుల కొంపల మధ్య నడుస్తుంటే రూల్డు ఆమెను చూసాడు. అతని భార్య పోయింది, అతని ఆరోగ్యంకూడా ఇలాగో అలాగో అని ఉంది. అతను చందాకి చెప్పాడు: " అమ్మాయి, నీకు ఇప్పుడు జాతి అని ఏమీ లేదు, అందువలన ఈ హరిజనుడుతో నువ్వు ఉండవచ్చు. మీ నాన్నగారి కోపం తగ్గిన తరువాత నేనే అతన్ని కలుసుకొని నిన్ను ఏలుకోమని అడుగుతాను." . గుడ్డివాడికి కావలసింది రెండు కళ్ళు; నీటిలో మునిగేవాడు ఒక ఎండగడ్డి దొరికినా దాన్ని పట్టుకుంటాడు. అలాగే చందా రూల్డా



చిన్న గుడిసెలో తన బిడ్డతో కాపురం చేస్తోంది. అది విని ఆమె తండ్రి " సరే, పోనీలే . . వీధుల్లో బికారిలాగ తిరగకుండా ఈ చందా ఈ రూల్డు దగ్గర ఉండడం - అతను తక్కువ జాతి మనిషి ఐనా - మంచిదే . ." అని తనలో తృప్తి పడ్డాడు. కాని ఊరిలో ఉన్న కొందరు ఆమె ఆ హరిజనులతో కాపురం చేయక ఆ చెరువులో దూకి చావాలి అని అన్నారు. మరి కొందరు యువకులు - రౌడీలు - రుల్డా గుడిసెని కాల్చివేదామని తలపెట్టారు, కాని ఊరి పెద్దలు అది జరగకూండా సమయానికి ఆపేసారు. అంతే కాదు, ఈ వానలో ఇంటిలోనే పొయ్యికి నిప్పు పెట్టడం వీలు కానప్పుడు ఇక గుడిశెని తగలపెట్టడం ఎలాగ?

దేవుని వింత లీలలు గురించి నేను చెప్పలేదూ? ఏ వాన వలన రుల్డా గుడిశె ప్రమాదం నుంచి తప్పిందో అదే వానలో ఆ ఇంటి మట్టి గోడలు కూలిపోయాయి. గోడారి తన దుఖానంలో పని చేస్తున్నాడు; తన బిడ్డ చలి, జ్వరంతో బాధపడుతుంటే చందా పొరుగింటిలో బతిమాలితే ఏవైనా మూలికలు దొరుకుతాయా అని వెళ్ళింది. తూర్పు దిశలోని గోడ కూలిపోగానే ఇంటికప్పులు వాలిపోయాయి; బిడ్డ ఒంటరిగా ఇంట్లోనే ఉంది; రుల్డా, చందా వెంటనే పరుగెత్తుకొని వచ్చారు కాని పసిపాప అంతలోనే పోయింది. పాపం, ఒక సారికూడా ఏడవలేదు; ఎలా పుట్టిందో అలాగే నెమ్మదిగా కన్ను మూసింది. తన బిడ్డను అలాగ

చూడగానే చందాన్ని ఒక విధమైన భయమూ, నిశబ్దమూ ఆక్రమించాయి. కళ్ళలోనుంచి ఒక కన్నీరు చుక్క కూడా రాలేదు; పెదిమలనుంచి ఒక వెక్కూ, నిట్టూర్పూ వెలుబడలేదు. ఏదో ఒక రాతిలా ఐపోనట్లు ఉంది ఆమె వాటం. బిడ్డ చనిపోయినప్పుడు ఆమె ఏడవలేదు అని అందరూ అన్నారు; తన దుఃఖమంతా గుండెలోనే ఇరుక్కుపోవడంతో ఆమె పిచ్చిదానిలా మారిపోయిందన్నారు ...

ఈ నా కళ్ళు! నాయనా, ఈ వాన తగ్గిన తరువాత నువ్వు నా కన్నులకి ఏమైనా మందు ఈ పక్కనే ఉన్న డాక్టరుగారి దుఖాణంలోనుంచి తెస్తావా?

నా మనసు ఇటూ అటూ తిరుగాడుతోంది. నేను అన్నట్టు ఆ నలుగురికి రుల్డూ, చందా రావడం చూసి దిగ్భ్రమ కలిగింది.

పండిట్ ధర్మ్ దాస్ వెంటనే అరిచాడు: " రుల్డు కాకా, అక్కడే ఆగు! నువ్వేం చేస్తున్నావో నీకు తెలుసా?"

రుల్డూ ఆగాడు. ఊరిలో అందరు తన్ను ప్రేమతో పిలిచినా తను తక్కువజాతివాడని అతనికి తెలుసు. ఇతరులు ఎది చెప్పినా మర్యాదగా వినడమే అతనికి అలవాటు. అతను రెండు చేతులూ ఎత్తి, నమస్కరించి, చెప్పాడు: "కొంచం దయ చేయండి బాబూ! మాకు చెట్టుకింద చాటు ఇవ్వండి. మేం ఒక మూల మీకు దూరంగా నిల్చుంటాం."



అని చెప్పి రుల్డూ ఒక అడుగు తీయగానే ధర్మ్ దాస్ మళ్ళీ గొంతు చించుకొని అరిచాడు: " అక్కడే నిలబడు! ఇది చాలా చిన్న చెట్టు; భవనం కాదు, మీరిద్దరూ ఒక మూల నిలబడడానికి . .". అతను థాకూర్ పక్కన తిరిగి చూసి, " థాకూర్ సాహెబ్, మనం వాళ్ళని ఇక్కడ రానివ్వకూడదు, లేకపోతే మనమూ వాళ్ళతో చస్తాం. ఇందులో ఒక అపాయం ఉంది . ." అన్నాడు.

కరణం రెహ్ మత్ ఖాన్ అడిగాడు: " పండిట్జీ, ఏ అపాయం గురించి మీరు మాట్లాడుతున్నారు?"

" ఖాన్ సాహెబ్, మీకు తెలియదు. మా శాస్త్రాల్లో మెరుపు తీగలు పాపాత్ములనీ, మైల పడిన జనులనీ తాకుతాయిని అని రాసారు. వీరిద్దరిలో ఒకడు తక్కువజాతివాడు; ఇంకోకామె పతిత. ఇక వాళ్ళు ఈ చెట్టుకింద వస్తే, పిడుగు పడితే, మనం చావక తప్పదు."

కరణం తొందర తొందరగా కొరాన్ నుంచి ఏదో మంత్రం చెప్పి తన్ను కాపాడుకోడానికి ప్రయత్నించాడు. " అలాగైతే మనం వాళ్ళని తప్పకుండా ఇక్కడికి రానివ్వకూడదు," అన్నాడు.

షావుకారు వాళ్ళతో ఒప్పుకున్నాడు. " అవును, అవును, మనం మన జీవితాల్ని వాళ్ళకోసం తెగించుకోకూడదు."

చందా కళ్ళు మిటకరించి థాకూర్ హర్ నాం సింగ్ ని చూసింది; ఆమె దేహమంతా వణుకుతోంది. అది చూసి రుల్డూ

మళ్ళీ థాకూర్ తో మొరపెట్టుకున్నాడు: " బాబూ, ఇక ఈ వానలో ఇంక నిలబడితే ఈ పిల్ల నిమోనియాతో చచ్చిపోతుంది; ఆమె బిడ్డ అప్పుడే పోయింది, అతని మీద ఇంటికప్పులు వాలి . . ."

చందా ఇంకా థాకూర్నే చూస్తోంది, కాని అతను మొహం తిప్పుకొన్నాడు. తను వినే మాటలకు ఏమీ అర్థం లేనట్టు తన తుపాకీని తీసి దాని గొట్టం ద్వారా చూసాడు. అవును మరి, అతను పెద్ద జమిందారుగారి అబ్బాయి కదా? ఈ దీనుల జీవితాలూ, చావులూ గురించి తనకేం కావాలి?

చందా బిడ్డ చనిపోయిందని వినగానే ధర్మ్ దాస్ అన్నాడు: "ఓ, అలాగా? దేవుడా, మంచి పనే చేసావు! ఈ పతితకి పుట్టిన బిడ్డ ఇక లేదు."

రుల్డూ మళ్ళీ మొరపెట్టుకున్నాడు. " పండిట్జీ, భగవంతుడు ఎది చేసినా అది మన మంచికే. ఐనదేమో ఐపోయింది. అందువలనే నేను చందాన్ని వాళ్ళ నాన్నగారి దగ్గరకి తీసుకువెళ్తున్నాను. ఇప్పుడు ఆ బిడ్డ లేకపోవడంతో ఏదైనా శాంతి చేస్తే చందా పాపం పోతుంది; ఇక ఆమె తన ఇంటికి వెళ్ళవచ్చు .. "

షావుకారు, ఎప్పటిలాగే, సబబుగా రాజీ చెయ్యడానికి ప్రయత్నించాడు. " అవన్నీ తరువాత చూద్దాంలే, రుల్డూ . . ఇప్పుడు నువ్వు వేరే జాగాకి వెళ్ళి తీరాల, ఇక్కడ నీకు జాగా లేదు . . " అని అన్నాడు.



రుల్డూ చెప్పాడు: " మీకు తెలుసుగా . . ఈ పక్కన మైళ్ళ దూరనికి మరేం చెట్టు లేదని . . ."

షావుకారు ఇక కొన్ని సంగతులు వివరించి చెప్పాలి అని నిశ్చయించాడు: " రుల్డూ కాకా, నువ్వు పెద్దవాడివి, కాబట్టి నేను చెప్తే నువ్వు అర్థం చేసుకుంటావు. మా గొడవ అంతా నీకు ఎటువంటి అపాయమూ రాకూడదనే. శాస్త్రాల్లో మెరుపుతీగలు మీలాటివారిని తాకుతాయని రాసారు. చూడు, మెరుపుతీగలు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి. నువ్వెందుకు మమ్మల్ని అపాయంలో దించుతావు చెప్పు? మా కర్మకి మమ్మల్ని వదిలేయ్, ఇక మీ కర్మని మీతో తీసుకుపో . . " అతను మాట్లాడుతుంటే ఆ దిక్కు మాలిన చందా, చలిలో వణుకుతూ, మెల్ల మెల్లగా అడుగు పెట్టి తమ దగ్గరకి రావడమూ, ఆమె బురదలో జారి పడడమూ చూసాడు; ఆమెను చూస్తే దయ్యం పట్టుకున్నట్టు ఉంది. ఆమె వెనుక, పాపం, రుల్డూ నిలబడి చందాన్ని ఆపడానికి ప్రయత్నిస్తున్నాడు. తటాలున ఒక మెరుపు మెరిసింది. అందరూ, భూతాలు లాగ తిరిగి చూసారు. అప్పుడే భూమిని అదిరించినట్టు పిడుగు సబ్దం వినబడింది. ఇక చావు పక్కనే వచ్చేసిందని పండిట్జీ కేకలు పెట్టాడు; " థాకూర్ సాహెబ్, మీ తుపాకీ ఎక్కడ? ఆమెను రానివ్వకండి! వస్తే మనందరం చస్తాం. చూడండి, ఎలాగ మెరుపు తీగలు ఆమెను తరుముకుంటూ వస్తున్నాయో . . "

థాకూర్ తుపాకీ ఎత్తి భుజం మీద పెట్టాడు, కాని అతని చేతులు వొణుకుతున్నాయి. తనకెదురుగా గురి చూస్తున్న ఆ తుపాకీని చూసి చందా పిచ్చెక్కి కెవ్వుమంది. "థాకూర్, నువ్వు ఇప్పటికే నా బిడ్డను చంపేసావు. ఇప్పుడు నన్ను కూడా చంపుతే నాకు మరేం భాగ్యం కావాలి? కాల్చు, త్వరగా కాల్చు, నేను నా బిడ్డను చేరుకుంటాను ..నా బిడ్డ .. అది నీ బిడ్డ కూడా .."

అది విని చందాకి నిజంగానే పిచ్చి పట్టిందని అందరూ నిశ్చయించుకున్నారు. ఆకాశంలో మేఘ గర్జన వినబడింది; ఎవరో శివుని ఖడ్గం ఒరనుంచి బయటకు తీసారా అనిపించింది. చందా వేప చెట్టుకి నాలుగైదు అడుగుల దూరంలో వచ్చేసింది. కాని థాకూర్ ఇంకా తుపాకీ కాల్చలేదు. షావుకారు మళ్ళీ అరిచాడు: " థాకూర్ సాహెబ్, తుపాకీ కాల్చండి, లేకపోతే ఈ పిచ్చి పిల్ల మనందరిని చంపేసి తనూ చస్తుంది."

కాని, నాయనా, దేవుని దయ ఉంటే వాళ్ళని ఎవరు చంపగలరు చెప్పు? థాకూర్ తుపాకి కాల్చడానికి ముందే ఆ శివుని ఖడ్గం వేపచెట్టుని క్రోధంతో తాకింది. తళుక్కున ఎక్కడ చూసినా కాంతి; సూర్యుడే గభీమని మబ్బులనుంచి భూమికే వచ్చేసాడా అన్నట్టు కన్నులని అంధం కప్పేసింది. ఆ కాంతి భరించలేక రుల్దూ, చందా కన్నులు మూసుకున్నారు. వెంటనే నూరు తుపాకీలు కాల్చినట్టు ధబేలుమంది. భూమి అదిరిపోయి రుల్దూ,



చందా, గభీమని ఎగిరిపడి నేలమీద వాలారు. తప్పకుండా ఆ మెరుపు వాళ్ళని తాకి ఉండాలి - మరి వాళ్ళు పాపిష్టులు కదా ?

కాని వాళ్ళు కన్నులు తెరిచి చూసినప్పుడు ఆ వేపచెట్టు పూర్తిగా కాలిపోయి దాని కింద నాలుగు శవాలు కనిపించాయి; ఆ మోట కళ్ళు దిగ్భ్రమతో, ఆశ్చర్యంతో ఆకాశాన్ని చూస్తున్నాయి. ఆఖరివరకూ వాళ్ళకి ఏం జరిగిందో తెలియలేదు కాబోలు! తుపాకీ థాకూర్ చేతిలో అలాగే ఉంది; కాని దాని గొట్టం నులుపుకొని మైనంతో చేసిన తుపాకీ లాగ కనిపించింది.

అందుకే నేను అడుగుతున్నాను: ఈ తుపాకీలూ, ఆయుధాలూ ఆ శివుని ఖడ్గం ముందు ఏం చెయ్యగలవు? నాయనా, ఎది ఐనా మన కర్మ బట్టే జరుగుతుంది. మనం చేసే పాపానికి మనం అనుభవించాలి . . దేవుని కళ్ళు అందరి హృదయాల్లోనూ దూసుకొని పోయి తెరలు తెరలుగా అణగి ఉన్న స్వభావం అర్ధం చేసుకుంటాయి; ఇక బయట కనిపించే తెల్లని వస్త్రాలూ, రాచవారి క్రీటాలూ, ధనం, ఆస్తులూ, ఇవన్నీ చూసి అవి మోసపోవు. మనుషుల హృదయంలో దాగి ఉన్న అధర్మం, అబద్దాలూ ఒక క్షణంలో తెలిసిపోతాయి. ఆ శివుని ఖడ్గం తాకినప్పుడు అది ఎంత పెద్ద చెట్టయినా దాన్ని వెన్నలాగ చేడించుతుంది. నాకు తెలుసు, నాయనా, నేను అది నా సొంత కళ్ళతో చూసాను

ఈ ముసలమ్మ మాటలు ఎవరూ నమ్మరు. నాకు పిచ్చి అని చెప్తారు . . కాని నేను చెప్పేది నిజమే నాయనా .. . . .

వాన ఆగినట్టుంది . . ఐతే నువ్వు వెళ్ళేటప్పుడు తప్పకుండా డాక్టరుని చూసి నా కళ్ళు లోతుకు పోయాయని, కళ్ళనుంచి నీరు వాన జల్లులాగ వస్తోందని చెప్పు; అతను నాకు మందు పంపిస్తాడు. ఆ పిచ్చి చందా నిన్ను పంపించింది అని చెప్పు . . .

ఏం, నాయానా, నువ్వు వెళ్ళిపోయావా? నా మాటలు విని నీకు విసుగ్గెత్తిందా? అసలు నువ్వు నేను చెప్పేది ఎదీ వినలేదు అనుకుంటా . . నా కథ వినడానికి ఎవరూ ఆగరు . . నాయనా, నువ్వు ఈ వాన ఆగేవరకైనా నాతో ఉండవలసింది . . . . .

*******